సాక్షి ప్రకాశం

శుక్రవారం । 28 । మార్చి । 2025

I




ఆ ఉపాధ్యాయుడిని రక్షిస్తుందెవరు.?
కురిచేడు మండలం పడమరనాయుడుపాలెం జెడ్పీ హైస్కూల్లో పనిచేస్తూ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడిపై విచారణ తూతూమంత్రంగా సాగింది. - IIలో..



అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి
అర్హులందరికీ బ్యాంకర్లు రుణాలివ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఒంగోలులో గురువారం జిల్లాస్థాయిలో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
36.5/25.4

వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత, ఉక్క పోత ఉంటుంది.



కుట్రలు ఛేదించుకొని..
పట్టు నిలుపుకొని!



త్రిపురాంతకం ఎంపీపీగా ఎన్నికైన ఆళ్ల సుబ్బమ్మతో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



మార్కాపురం ఎంపీపీగా ఏకగ్రీవమైన లక్ష్మీదేవితో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- రెండు ఎంపీపీలు, ఒక వైస్ ఎంపీపీ స్థానాలు కైవసం
- మార్కాపురం ఎంపీపీ ఏకగ్రీవం
- ఉత్కంఠ పోరులో త్రిపురాంతకం ఎంపీపీ స్థానాన్ని గెలుచుకున్న వైఎస్సార్ సీపీ
- పుల్లలచెరువు వైస్ ఎంపీపీ పదవిని సైతం లాటరీలో గెలుచుకుని విజయకేతనం
- కుట్రలు భగ్నం కావడంతో టీడీపీలో నైరాశ్యం
- జయకేతనం ఎగురవేసిన వైఎస్సార్ సీపీలో ఉత్సాహం
- ఫలించిన ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి వ్యూహం

బలం లేకపోయినా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకునేందుకు టీడీపీ చేసిన కుట్రలు ఫలించలేదు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు పోలీసులను రంగంలోకి దించింది. అధికారులను మొహరించింది. ప్రలోభాలకు తెరతీసింది. తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపించింది. ఏ మాత్రం చిన్న అవకాశం దొరికినా వదిలిపెట్టకుండా దిగజారుడు రాజకీయాలు చేసింది. అయినాసరే.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అదరలేదు, బెదరలేదు. ప్రలోభాలకు తలొగ్గలేదు. మొదట్నుంచి పార్టీ పట్ల, ప్రజల పట్ల ఏ నిబద్ధతతో కొనసాగారో చివరిదాకా అంతే నిబద్ధతగా నిలబడ్డారు. ప్రత్యర్థి పార్టీ ఎత్తులను చిత్తు చేశారు.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో అధికార టీడీపీ బరి తెగించింది. ప్రజాప్రతినిధిగా ఎంపికైన వారినే ఓటు వేయకుండా చేసేందుకు అడుగడుగునా కుట్రలకు పాల్పడింది. అక్రమ మార్గంలో అధికారం కోసం చేసిన కుట్రలు విఫలం కావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వ్యూహం ఫలించడంతో ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపింది.

త్రిపురాంతకంలో కుట్రలకు చెంపదెబ్బ...

ఉప ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి త్రిపురాంతకం ఎంపీపీ ఎన్నిక జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అధికార టీడీపీ పలురకాల కుట్రలకు తెరదీయడంతో చివరి వరకూ అనేక మలుపులు తిరిగింది. ఇక్కడ మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వైఎస్సార్ సీపీ 17, ఇండిపెండెంట్ 1 గెలిచారు. ఒప్పందంలో భాగంగా తొలి రెండున్నర సంవత్సరాలు కోట్ల సుబ్బారెడ్డి ఎంపీపీగా వ్యవహరించారు. ఆ తర్వాత ఆయన రాజీనామా చేశారు. ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్ ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మను నియమించాల్సి ఉంది. కానీ, మరో వైస్ ఎంపీపీగా ఉన్న ఒట్టిముక్కల రిబ్బక్కమ్మను నియమించడంతో త్రిపురాంతకం రాజకీయ పరిణామాలు మారిపోయాయి. ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత త్రిపురాంతకం ఎంపీపీ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలని అధికార టీడీపీ కుతంత్రాలు మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఎంపీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయరెడ్డిపై తప్పుడు కేసులు బనాయించింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడమే కాకుండా నిబంధనలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి ఆయనను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రంతా కూర్చోబెట్టి మరుసటి రోజు కేసు నమోదు చేయడం విమర్శలపాలైంది. అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. ఘటన స్థలాన్ని డీఎస్పీ పరిశీలించాలి. ఇరుగుపొరుగు వారిని విచారించాలి. విజువల్స్ సేకరించాలి. ఆ తర్వాత మాత్రమే కేసు నమోదు చేయాలి. ఇవన్నీ గాలికి వదిలేసిన పోలీసులు.. అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కయి ఆంజనేయరెడ్డి మీద కేసు పెట్టడమే కాకుండా ఆయనను జిల్లా జైలుకు పంపించి నియంతృత్వాన్ని చాటుకున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు. ఆంజనేయరెడ్డి జైలుకు వెళ్లడంతో ఆయన భార్య ఆళ్ల సుబ్బమ్మను ఎంపీపీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నిలబెట్టింది.

న్యాయానికి జై కొట్టిన సృజన...

త్రిపురాంతకం ఎన్నికలు చివరి నిముషం వరకు ఉత్కంఠ రేపాయి. అధికార టీడీపీ కొంత మంది ఎంపీటీసీలను లోబరచుకుని పోటీకి దింపింది. కొంతమంది ఎంపీటీసీలను గృహ నిర్బంధంలో ఉంచింది. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఆంజనేయరెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపించింది. మరో ఎంపీటీసీ సుబ్బారావుపై కూడా కేసు పెట్టి అరెస్టు చేయడానికి ప్రయత్నించింది. గురువారం ఉదయం ఎన్నిక సమయానికి వైఎస్సార్ సీపీ ఎంపీపీ అభ్యర్థి ఆళ్ల సుబ్బమ్మకు మద్దతుగా ఏడుగురు సభ్యులు లోపలికి వెళ్లారు. 9 మంది సభ్యులతో ప్రత్యర్థి వర్గం వారు హాజరయ్యారు. చివరి నిముషంలో ఎంపీటీసీ సృజన వైఎస్సార్ సీపీకి మద్దతుగా చెయ్యి ఎత్తారు. ఇండిపెండెంట్ అభ్యర్థి కృష్ణ కూడా తన ఓటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి సుబ్బమ్మకు వేయడంతో టీడీపీకి దిమ్మెరపోయినట్లయింది. ఊహించని ఈ పరిణామంతో త్రిపురాంతకం ఎంపీపీ పదవిని వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. ఈ పరిణామం జిల్లాలో సంచలనం సృష్టించింది.

బూచేపల్లి, తాటిపర్తి సక్సెస్ వ్యూహం...

ఈ ఎన్నికల్లో విజయం కోసం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ చేసిన టీం వర్క్ మంచి ఫలితాలిచ్చింది. త్రిపురాంతకంలో ఆంజనేయరెడ్డిని అరెస్టు చేసిన తర్వాత రంగంలోకి దిగిన బూచేపల్లి, తాటిపర్తి సమష్టిగా పనిచేశారు. ఒకవైపు ఆళ్ల కుటుంబానికి ధైర్యం ఇస్తూనే మరోవైపు ఎంపీటీసీలను ఐక్యంగా కలిపి ఉంచడంలో సఫలీకృతులయ్యారు. ఎంపీటీసీలను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి కలిపించడమే కాకుండా ఎంపీపీగా ఆళ్ల సుబ్బమ్మను రంగంలోకి దించి విజయం సాధించారు. ప్రస్తుతం జిల్లాలో ఈ జంట నాయకుల వ్యూహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన 9 నెలలకే అపజయం...

అధికారంలోకి వచ్చిన 9 నెలలకే స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో అధికార టీడీపీ, జనసేన కూటమి బోల్తా పడటంతో కూటమి నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. అధికారులను, పోలీసులను ప్రయోగించినా ఫలితం దక్కకపోవడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినప్పటికీ ఎంపీటీసీలు పార్టీ వైఖరికి కట్టుబడటం, నిజాయితీగా వ్యవహరించడంతో చావుదెబ్బ తిన్న కూటమికి భవిష్యత్తు భయం పట్టుకుందని చెప్పవచ్చు. ఇదిలా ఉండగా, ఈ విజయంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది.

లాటరీలో విజయం దక్కించుకున్న రాములు...

పుల్లలచెరువు వైస్ ఎంపీపీ పదవికి జరిగిన ఉప ఎన్నికలు చివరి నిముషం వరకు ఉత్కంఠ రేపాయి. ఇక్కడ మొత్తం 15 స్థానాలు ఉండగా 11 స్థానాల్లో వైఎస్సార్ సీపీ, 4 స్థానాల్లో టీడీపీ గెలిచి ఉన్నాయి. ఇటీవల ఎంపీపీ కందుల వెంకటయ్య పచ్చ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటుగా మరో ఇద్దరు ఎంపీటీసీలు కూడా సైకిలెక్కారు. దాంతో వైఎస్సార్ సీపీకి 8 మంది ఎంపీటీసీలు, టీడీపీకి ఏడుగురు ఎంపీటీసీలు ఉన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన గంగవరం ఎంపీటీసీ సభ్యురాలు కోట్ల నరసమ్మ ఓటు వేసేందుకు మండల పరిషత్ కార్యాలయానికి రాలేదు. ఆమె భర్త రమణారెడ్డికి చెందిన బంధువులు టీడీపీలో ఉన్నారు. వారు తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయించాలని తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. దిక్కుతోచని పరిస్థితుల్లో ఆమె ఓటు వేసేందుకు వెళ్లలేదు. వైస్ ఎంపీపీ అభ్యర్థులకు సమానంగా ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తడంతో ఎన్నికల అధికారి డ్రా తీశారు. ఈ డ్రాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి వైస్ ఎంపీపీ పదవి దక్కింది.

మాటపై నిలబడిన మార్కాపురం ఎంపీటీసీలు...

మార్కాపురం ఉప ఎన్నికల ఫలితాలు ఊహించినట్లుగానే వచ్చాయి. మండలంలో 15 మంది ఎంపీటీసీలు ఉన్నారు. నికరంపల్లి ఎంపీటీసీ అనారోగ్యంతో మరణించారు. గోగులదిన్నె ఎంపీటీసీ రాజీనామా చేశారు. దీంతో 13 మంది ఎంపీటీసీలు మిగిలారు. వారంతా మొదట్నుంచి పార్టీ వైఖరికి కట్టుబడి అన్నా రాంబాబు బాటలోనే నడిచారు. అధికార పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ఎంపీటీసీలంతా ప్రస్తుత ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న వైస్ ఎంపీపీ కృష్టారెడ్డి లక్ష్మీదేవిని గెలిపించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు వ్యూహాత్మకంగా వ్యవహరించి సులువుగా విజయం సాధించేలా చేశారు.

కూటమికి చెంపదెబ్బ, గోడదెబ్బ

- అక్రమ కేసులు బనాయించి మండల పరిషత్ పదవులు కైవసం చేసుకోవాలనుకున్నారు
- ఎంపీపీని చేస్తానని ఆశ చూపి డబ్బు కొల్లగొట్టారు
- ఎంపీటీసీలకు అధికారం, డబ్బు ఎరవేశారు
- మండల పరిషత్ నిధులు దోచుకోవడానికే ఎత్తుగడలు
- ఏదో ఒక విధంగా నియోజకవర్గాన్ని వల్లకాడు చేయాలనుకుంటున్నారు
- చివరకు ఘోరంగా విఫలమయ్యారు
- వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం:

మండల పరిషత్ ఉప పోరులో కూటమి నాయకులకు చెంపదెబ్బ, గోడదెబ్బ తగిలాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు దిమ్మదిరిగే తీర్పిచ్చారన్నారు. గురువారం స్థానిక సంస్థల ఉప పోరు ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిపురాంతకం మండలంలో ఒక్క ఎంపీటీసీ సభ్యుడూ లేకున్నప్పటికీ వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా జ్యోతి భర్త ఎల్లారెడ్డికి ఎంపీపీ పదవి ఆశచూపి కూటమి నాయకుడు డబ్బులు కొల్లగొట్టాడని తెలిపారు. వారితో కోట్లాది రూపాయలు ఖర్చుచేయించి ఆ కుటుంబంతో పాటు మరో ఏడుగురు ఎంపీటీసీలకు అన్యాయం చేశారని ఆయన విమర్శించారు. మాజీ ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి గతంలో తన పదవికి రాజీనామా చేసిన తర్వాత వైస్ ఎంపీపీ-1గా కొనసాగుతున్న ఆళ్ల సుబ్బమ్మకు తాత్కాలిక ఎంపీపీ పదవి ఇవ్వకుండా వైస్ ఎంపీపీ-2గా ఉన్న రిబకమ్మను ఎంపీపీ పీఠంపై కూర్చోబెట్టి పెత్తనం చలాయించాడన్నారు. ఎన్నికలు జరిగిన మూడు మండలాల ఎంపీటీసీ సభ్యులకు అధికారం, డబ్బు ఎరగా చూపాడని, ఇదంతా టీడీపీపై ఉన్న ప్రేమతో కాదని, మండల పరిషత్ నిధులు దోచుకోవడానికి వేసిన ఎత్తుగడలేనని ఆయన అన్నారు. ఏదో ఒక విధంగా నియోజకవర్గాన్ని వల్లకాడు చేయడానికి వేసుకున్న పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని, ఇటువంటి విషసంస్కృతి తీసుకొస్తున్నాడని ఆయన దుయ్యబట్టారు. త్రిపురాంతకంలో ఎంపీపీ రేసులో ఉన్న ఆళ్ల ఆంజనేయరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం కేసు బనాయించడమే అందుకు నిదర్శనమని ఆయన అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఇటువంటి కేసులు అగ్రకులాల వారిపై ప్రయోగించడం హేయమైన చర్యని, అధికారాన్ని అడ్డంపెట్టుకుని డబ్బు దోచుకోవాలని, అడ్డు వచ్చినవారిని బొక్కలో నెట్టించాలన్న ఆలోచనతో కూటమి నాయకుడు ఉన్నాడని ఆయన తీవ్రంగా విమర్శించారు. మండల పరిషత్ ఎన్నికల్లో అట్రాసిటీ కేసులు, హత్యాయత్నం కేసులతో పాటు వ్యాపారాలు చేస్తున్న ఎంపీటీసీ సభ్యులను, వైద్యశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను బెదిరింపులకు గురిచేయడం కూటమి నాయకుడికే తగిందని ఆయన అన్నారు.

ఇండిపెండెంట్ ఎంపీటీసీ కృష్ణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని, ఆయన ఇంటిపైకి మనుషులను పంపించాడని, వెంజర్లు వేసి వ్యాపారం చేసుకోవాలనుకుంటే టీడీపీ బలపరిచిన అభ్యర్థికే ఓటు వేయాలని భయభ్రాంతులకు గురిచేశాడని ఎమ్మెల్యే తెలిపారు. ఇటువంటి బెదిరింపులకు భయపడకుండా ఈ ఎన్నికల్లో ఎంపీటీసీ సభ్యులు దిమ్మదిరిగే తీర్పు ఇచ్చారని, ఇప్పటికైనా కూటమి నేతలు వారి పద్ధతులు మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, కె.ఓబులరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, ఆర్.అరుణాబాయి, వెంకటేశ్వర్లు నాయక్, జానకి రఘు, రాములు, టి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు నాయకుల నియామకం

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాలలో పదవులకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను నియమిస్తూ రాష్ట్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లాకు చెందిన 13 మంది నాయకులను వివిధ విభాగాలలో పదవులకు నియమించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా ఉన్నం జనార్దన్ (బుజ్జి), సహాయ కార్యదర్శులుగా బి.ప్రవీణ్ కుమార్, కటికల వెంకటరత్నంను నియమించారు. రాష్ట్ర వలంటీర్ల వింగ్ జనరల్ సెక్రటరీగా ఆవుల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా గోనెల మేరీకుమారి, జాయింట్ సెక్రటరీగా గొలమారి చెన్నారెడ్డిని నియమించారు. రాష్ట్ర బూత్ కమిటీ విభాగం జనరల్ సెక్రటరీగా ఎక్కంటి వెంకటరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా విభాగం జాయింట్ సెక్రటరీలుగా గొర్రెముచ్చు ఏడుకొండలు, పేరం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, రాష్ట్ర ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం జనరల్ సెక్రటరీగా బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రటరీగా రొండా అంజిరెడ్డి, రాష్ట్ర వీవర్స్ విభాగం కార్యదర్శిగా జి.వెంకటేశ్వర్లు (చిన్న), రాష్ట్ర వీవర్స్ విభాగం జాయింట్ సెక్రటరీగా గాలి నాగేశ్వరరావును ప్రకటించారు.

పెయింట్ షాపులో భారీ అగ్నిప్రమాదం

- సుమారు రూ.25 లక్షలకుపైగా ఆస్తినష్టం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మార్కాపురం: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో పూలసుబ్బయ్య కాలనీ సమీపంలో ఉన్న శివశక్తి ట్రేడర్స్ పెయింట్ షాపులో గురువారం మధ్యాహ్నం షార్టు సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగి సుమారు 25 లక్షల రూపాయలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లింది. పెయింట్ డబ్బాలు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయని షాపు యజమానులు తనుబుద్ది వెంకటేశ్వర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలిసిన వెంటనే మార్కాపురం ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు.

వెట్టిచాకిరి బాధితులను ఆదుకోవాలి



సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: వెట్టిచాకిరి నుంచి ఇటీవల విముక్తులను చేసిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వివిధ విభాగాల అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని తన చాంబర్‌లో గురువారం జిల్లాలోని వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొత్తపట్నం మండలంలోని ఆలూరు, ఈతముక్కల గ్రామాలకు చెందిన ఏడు కుటుంబాల ప్రజలు 25 మందికి వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించిన విషయం తెలిసిందే. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలో జామాయిల్ తోటల్లో పనికి కొందరిని తీసుకెళ్లి వారి అమాయకత్వాన్ని, అవసరాన్ని, పేదరికాన్ని అవకాశంగా చేసుకుని వారితో యజమాని వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేకంగా అధికారుల బృందాన్ని అక్కడకు పంపి వారిని తీసుకురావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వారిలో గర్భిణులు, బాలింతలతో కూడా బలవంతంగా పనిచేయిస్తున్నట్లు యానాది సంఘాల మహాకూటమి, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వారిని విడిపించి వారికి రిలీజ్ సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం కూడా ఇప్పించడం జరిగిందన్నారు. ఆయా కుటుంబాల పునరావాసం కోసం అన్ని ప్రభుత్వ సంస్థలు సహకరించుకుని వారికి ఉపాధి, స్థిరనివాసం, వారి పిల్లల భవిష్యత్తు కోసం అందరూ కలిసి పనిచేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

త్రిపురాంతకం ఎంపీపీ పీఠంపై సుబ్బమ్మ



కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన సాధిక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, నాయకులు

యర్రగొండపాలెం: త్రిపురాంతకం ఎంపీపీగా వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు ఆళ్ల సుబ్బమ్మ ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎంపీపీ ఉప ఎన్నికలో ఎంపీపీ పీఠాన్ని తమ వశం చేసుకోవడానికి కూటమి నాయకుడు వేసిన ఎత్తుగడకు ఎంపీటీసీ సభ్యులు చెల్లుచీటీ పలికారు. ఎవరూ ఊహించని విధంగా కూటమి గుంపు వెంట వచ్చినవారు సైతం వైఎస్సార్ సీపీ అభ్యర్థినికి అండగా నిలిచారు. మండలంలో మొత్తం 18 మంది ఎంపీటీసీ సభ్యులుండగా 17 మంది వైఎస్సార్ సీపీ, ఒకరు ఇండిపెండెంట్ ఎంపీటీసీగా ఉన్నారు. వారిలో ఆళ్ల ఆంజనేయరెడ్డిని పార్టీ ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఆయనపై కూటమి నాయకుడు పోలీసులతో అక్రమ కేసులు బనాయించి రిమాండ్‌కు పంపారు. మరో ఎంపీటీసీ ఎస్.సుబ్బారావుపై కూడా కేసులు నమోదు చేయించారు. ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఆళ్ల సుబ్బమ్మకు 9 మంది, టీడీపీ మద్దతుతో పోటీ చేసిన చల్లా జ్యోతికి ఎనిమిది మంది ఎంపీటీసీలు చేతులెత్తారు. దీంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలుపొందినట్లు ఎన్నికల ప్రత్యేకాధికారి ప్రకటించారు.

యర్రగొండపాలెంలో...

మండల కో ఆప్షన్ సభ్యుడి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సయ్యద్ సాధిక్ విజయం సాధించారు. మండలంలోని 18 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 11 మంది వైఎస్సార్ సీపీ, ఏడుగురు టీడీపీ ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలలో ఒకరిని తమ వైపు తిప్పుకోవడంతో టీడీపీకి 8 మంది ఎంపీటీసీలయ్యారు. గురువారం జరిగిన ఎన్నికలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సాధిక్‌కు 10 మంది ఎంపీటీసీలు చేతులెత్తడంతో ఆయన కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

మార్కాపురం ఎంపీపీగా లక్ష్మీదేవి



బండి లక్ష్మీదేవికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరెడ్డి

మార్కాపురం: మార్కాపురం మండల పరిషత్ అధ్యక్షురాలిగా తిప్పాయిపాలెం ఎంపీటీసీ సభ్యురాలు బండి లక్ష్మీదేవీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఆమెకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మార్కాపురం డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎంపీపీగా ఉన్న నాయుడుపల్లి ఎంపీటీసీ పోరెడ్డి అరుణ గతేడాది మార్చిలో వ్యక్తిగత కారణాలతో ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. ఆమె స్థానంలో వైస్ ఎంపీపీగా ఉన్న బండి లక్ష్మీదేవీ కృష్టారెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఎన్నికల కమిషన్ ఖాళీగా ఉన్న స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో గురువారం ఎంపీపీ ఎన్నికకు మార్కాపురం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. మొత్తం 15 మంది ఎంపీటీసీలు ఉండగా, ఒక ఎంపీటీసీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మరొకరు రాజీనామా చేశారు. దీంతో 13 మంది ఎంపీటీసీలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. రాయవరం 2 ఎంపీటీసీ దేవండ్ల లక్ష్మమ్మ, గజ్జలకొండ ఎంపీటీసీ జమ్ముల మూడి రమేష్, ఇడుపూరు ఎంపీటీసీ కవలకుంట్ల పేతురు, గొట్టిపడియ ఎంపీటీసీ కొర్రపోలు సంధ్యారాణి, కొండేపల్లి ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి, తూర్పుపల్లి ఎంపీటీసీ మాలపాటి శ్రీనివాసరెడ్డి, భూపతిపల్లి ఎంపీటీసీ మల్లాపురం లక్ష్మీదేవీ, వేములకోట ఎంపీటీసీ నంద్యాల చిన్నవీరయ్య, రాయవరం 1 ఎంపీటీసీ పల్లెబోయిన వెంకట సుబ్బమ్మ, నాయుడుపల్లి ఎంపీటీసీ పోరెడ్డి అరుణ, చింతగుంట్ల ఎంపీటీసీ పుచ్చకాయల ఎల్లమ్మ, పెద్దయాచవరం ఎంపీటీసీ తన్నీరు వీరనారాయణమ్మ హాజరయ్యారు. కాగా, కొండేపల్లి ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి బీ ఫాంను అధికారులకు అందించి సభ్యులకు విప్ జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో అందరూ పాల్గొని ఎంపీపీగా బండి లక్ష్మీదేవిని ఎన్నుకున్నారు.

వైస్ ఎంపీపీ కైవసం చేసుకున్న వైఎస్సార్ సీపీ




ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఉపాధ్యక్షుడు ఎల్.రాములు

పుల్లలచెరువు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన మండల ఉపాధ్యక్ష పదవి ఎన్నికలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి లింగంగుంట్ల రాములు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఉపేంద్రకుమార్ తెలిపారు. గతంలో ఉన్న ఉపాధ్యక్షుడు కందుల వెంకటయ్య ఎంపీపీగా ఎన్నికవడంతో ఉపాధ్యక్ష పదవి ఖాళీ అయింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించారు. పుల్లలచెరువు మండల పరిషత్‌లో 15 మంది ఎంపీటీసీలు ఉండగా, ఉపాధ్యక్ష పదవి ఎన్నికకు 14 మంది సభ్యులు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ తరఫున ఏడుగురు, టీడీపీ తరఫున ఏడుగురు సభ్యులు హాజరవడంతో ఎన్నిక డ్రా అయింది. దీంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లాటరీ తీయగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి లింగంగుంట్ల రాములు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణపత్రం అందజేశారు. ఎన్నికలు సజావుగా జరిగేలా మార్కాపురం డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. అనంతరం సభ్యులంతా రాములును కలిసి అభినందనలు తెలిపారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

ఒంగోలు వన్‌టౌన్: ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డులో గల పీఏజీ కళ్యాణ మండపంలో గురువారం ముస్లింలకు ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. మంత్రితో పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఇమామ్, మౌజన్‌లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లించామన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, డీఆర్‌ఓ చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, ముస్లింలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

ఆగి.. సాగిన పొగాకు వేలం

- ఆరంభంలోనే దిగజారిపోతున్న పొగాకు ధరలు
- కనీస మద్దతు ధర కల్పించాలని రైతుల డిమాండ్


రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం వేలాన్ని రైతులు అడ్డుకున్నారు. వేలం కేంద్రానికి కామేపల్లి, అనకర్లపూడి గ్రామాలకు చెందిన రైతులు 429 పొగాకు బేళ్లను తీసుకువచ్చారు. అయితే 80 బేళ్లను కొనుగోలు చేసిన తరువాత కనిష్ట ధర రూ.240 కి తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. వెంటనే రైతులు గమనించి వేలాల్లి అడ్డుకున్నారు. కనీస మద్దతు ధర ఇస్తేనే వేలం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీంతో వేలం నిర్వహణాధికారి కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. అనంతరం రైతులతో మాట్లాడగా..కనీస ధర తగ్గించకుండా ఉంటేనే వేలం కొనసాగిస్తామని చెప్పారు. వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్ హామీతో రైతులు అంగీకారం తెలపడంతో తిరిగి వేలాన్ని ప్రారంభించి యధావిధిగా కొనుగోలు కొనసాగించారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి


ఇంద్రసేనారెడ్డి(ఫైల్)

అర్ధవీడు: బైక్‌ను లారీ ఢీకొట్టంతో ఓ ఆర్మీ జవాన్ మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి పల్నాడు జిల్లా మాచర్ల సమీపంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. అర్ధవీడు మండలంలోని నారాయణపల్లెకు చెందిన సగిలి ఇంద్రసేనారెడ్డి(26) ఇండియన్ ఆర్మీ 7 మద్రాస్ బెటాలియన్‌లో సేవలందిస్తున్నారు. హైదరాబాద్‌లో బంధువుల ఇంట వివాహానికి హాజరై స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యంలో మాచర్ల సమీపంలో లారీ ఢీకొట్టడంతో ఇంద్రసేనారెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న కుమారుడు అర్ధంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు రంగారెడ్డి, సుబ్బమ్మ గుండెలవిసేలా రోదిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్ అదుపుతప్పి రైతు మృతి


మృతి చెందిన వెంకటేశ్వరరెడ్డి

తాళ్లూరు: బైక్ అదుపు తప్పడంతో ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం సమీపంలో గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. వెలుగువారిపాలెం గ్రామానికి చెందిన మూలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పంట చేనుకు నీరు పెట్టేందుకు బుధవారం రాత్రి బైక్‌పై వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి వెతికారు. ఈ క్రమంలో పొలం సమీపంలో రోడ్డు పక్కన విగతజీవిగా పడి ఉన్న వెంకటేశ్వరరెడ్డి కనిపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


ప్రమాదంలో మరణించిన షాహిద్

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని బిలాల్ నగర్‌కు చెందిన షేక్ షాహిద్(40) గురువారం తెల్లవారుజామున మోటారు బైకు మీద వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హెచ్‌బీడీ బ్యాంకు లోన్ విభాగంలో పనిచేస్తున్న ఆయన నెల్లూరు వెళ్లి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. తెల్లవారుజామున కావడంతో ప్రమాదం ఎలా జరిగిందో స్పష్టంగా తెలియడం లేదు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షాహిద్ ఫొటో వాట్సప్ గ్రూపుల్లో పెట్టడంతో కుటుంబ సభ్యులు గుర్తించి కన్నీరుమున్నీరయ్యారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ఉపాధ్యాయున్ని రక్షిస్తుందెవరు..?

- నిందితుని సమక్షంలో సహచర ఉపాధ్యాయులు, విద్యార్థుల విచారణ
- ఉపాధ్యాయున్ని రక్షించేందుకు రంగంలోకి టీడీపీ నాయకులు
- గ్రామస్తులను విచారించకుండానే విచారణ పూర్తి
- విద్యా శాఖాధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం


టీడీపీ నాయకుడి సమక్షంలో ఉపాధ్యాయులను విచారిస్తున్న డిప్యూటీ డీఈఓ

కురిచేడు: విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై విచారణ సాగిన తీరుపై సర్వత్రా విమర్శలు వక్తమవుతున్నాయి. విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు రావడంతో జిల్లా విద్యాశాఖాధికారి సస్పెండ్ చేసిన విషయం విధితమే. మండలంలోని పడమరనాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కరిముల్లాపై గురువారం విచారణ తూతూమంత్రంగా సాగింది. సంఘటన వెలుగుచూసిన సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓలు సంఘటన వాస్తవమని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చి..విచారణ సమయంలో మాత్రం ఏం జరగనున్నట్లు వ్యవహరించడాన్ని గ్రామస్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు పాఠశాలలో గురువారం విచారణ చేపట్టారు. అయితే గ్రామ టీడీపీ నాయకుడు గడ్డం బాలయ్య సమక్షంలో విచారణ చేపట్టారు. అయితే గ్రామస్తులను విచారించకుంటే కేవలం ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్టేట్‌మెంట్లు రాయించుకొని విచారణ ముగించారు. దీనిపై గ్రామస్తులు మండిపడుతున్నారు. మాతో మాట్లాడకుండా విచారణ పూర్తయిందని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడైన ఉపాధ్యయుడిని కాపాడేందుకు టీడీపీ నేతలు, విద్యా శాఖాధికారులు కుమ్మక్కయ్యారని, ఇలాంటి స్థితిలో బాలికలను ఏ ధైర్యంతో పాఠశాలకు పంపాలని ప్రశ్నించారు. కూటమి నాయకులతో మంతనాలు చేసి విచారణలో వాస్తవాలు బయటకు రాకుండా చేసి ఉపాధ్యాయుడిని విద్యాశాఖాధికారులు కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. విచారణ సందర్భంగా నిజానిజాలు తెలుసుకోకుండా కేవలం ఉపాధ్యాయున్ని కాపాడేలా విచారణ సాగిందని పేర్కొంటున్నారు. విద్యాశాఖ, టీడీపీ నేతల తీరుతో ప్రభుత్వ పాఠశాలలో ప్రతిష్ట మసకబారే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని విచారణ పూర్తి స్థాయిలో జరిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బంగారు బాల్యమే లక్ష్యం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ప్రకాశం భవన్‌లో బంగారు బాల్యం జిల్లా రిసోర్స్ సెంటర్ ప్రారంభం


బంగారు బాల్యం జిల్లా రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లాలో బాలల బాల్యాన్ని బంగారుమయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో ఏర్పాటు చేసిన బాలల వనరుల కేంద్రాన్ని గురువారం ఉదయం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినూత్నంగా చేపట్టిన బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రత్యేకంగా బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలలకు పోషకాహార ఆవశ్యకతతో పాటు బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై కూడా అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లా కేంద్రంలో బాలల వనరుల కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలోని బాలల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రత్యేకంగా నీతి ఆయోగ్ నుంచి ఒక ప్రతినిధి ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ కేంద్రం ద్వారా బాలల హక్కుల పరిరక్షణతో పాటు బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేకంగా పనిచేయనున్నట్లు చెప్పారు. అందుకోసం చేసిన ఏర్పాట్లను, ఫొటో ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. జిల్లాలో చేపట్టిన బంగారు బాల్యం కార్యక్రమానికి స్కోచ్ అవార్డు రావడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాగం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ అవార్డు సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ హేనసుజన, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, డీటీసీ ఆర్.సుశీల, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ అర్చన, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన నిద్ర మత్తు


గోవిందరావు మృతదేహం


గాయపడిన డ్రైవర్ మణికంఠ

- బొలేరోను ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు


నుజ్జు అయిన ఫార్చునర్ కారు


నుజ్జు అయిన బొలేరో వాహనం

బేస్తవారిపేట: నిద్ర మత్తు ఒకరి ప్రాణం తీసింది. మండంలోని పందిళ్లపల్లె సమీపంలో ఒంగోలు -నంద్యాల హైవేరోడ్డుపై కారు, బోలేరో వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నుంచి గుత్తికి వెళ్తున్న ఫార్చునర్ కారు డ్రైవర్ నిద్రమత్తులో ఎదురుగా కర్నూల్ నుంచి గుంటూరుకు ఎండుమిరపకాయల లోడుతో వెళ్తున్న బోలేరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న గోవిందచారి(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు విజయవాడ గురునానక్‌కాలనీకి చెందిన వ్యక్తి. అనంతపురంలోని గుత్తి వద్ద క్వార్ట్ మైనింగ్ వ్యాపారం చేస్తున్నాడు. డ్రైవర్ మణికంఠ చెయ్యి, కాలు విరిగిపోయాయి. బోలేరో వాహనంలో డ్రైవర్ అశోక్ కూరుకపోయాడు. రెండు వాహనాలు నుజ్జు నుజ్జు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను గంటపాటు శ్రమించి అశోక్‌ను బయటకు తీశారు. అశోక్ రెండు కాళ్లు విరిగిపోయాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన మణికంఠను ఒంగోలుకు, అశోక్‌ను నంద్యాలకు తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి కిడ్నాప్‌కు విఫలయత్నం!

- దుకాణం అడ్రస్ చూపాలని బాలుడిని బైక్‌పై ఎక్కించుకున్న దుండగులు
- విద్యార్థి ప్రతిఘటించడంతో అదుపు తప్పిన బైక్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాలుడి తల్లిదండ్రులు


స్టీఫెన్ పాల్

దర్శి: స్కూల్‌కు వెళ్తున్న ఓ బాలుడిని పట్టపగలే ఇద్దరు దుండగులు కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశారు. ఈ సంఘటన దర్శి మండలంలోని కృష్ణాపురం-ఎస్సీ కాలనీ మధ్య గురువారం చోటుచేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన గుంటూరి మరియదాసు, లూర్దియమ్మ కుమారుడు స్టీఫెన్ పాల్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కు వెళ్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ×నారాయణ కొట్టు ఎక్కడ¤ అని అడిగారు. అడ్రస్ చూపించాలని బైక్‌పై ఎక్కించుకున్నారు. నారాయణకొట్టు దాటిపోయినా బైక్ ఆపకుండా బాలుడి నోరు నొక్కారు. కాసేపు పెనుగులాడిన బాలుడు చేతిలో ఉన్న బాటిల్‌తో దుండగుడి తలపై కొట్టడంతో బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఓ దుండగుడి కాలికి రక్తగాయం కావడంతో ×మళ్లీ వచ్చి నీ సంగతి చూస్తాం¤ అంటూ బెదిరించి పారిపోయారు. ఈ విషయాన్ని బాలుడు తన తల్లిదండ్రులకు తెలియజేయగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి లోడ్ లారీ బోల్తా



పెద్దారవీడు: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో మిర్చి లోడ్ లారీ బోల్తా పడింది. ఈ సంఘటన గురువారం వేకువజామున పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణానికి చెందిన రైతులు మిర్చిని లారీలో లోడ్ చేసుకుని గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో దేవరాజుగట్టు సమీపంలో లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌తో సహా రైతులు స్వల్ప గాయాలతో బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

3వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఏపీపీగా కేవీ రామేశ్వరరెడ్డి

ఒంగోలు: ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేవీ రామేశ్వరరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఈ హోదాలో మూడేళ్లపాటు కొనసాగుతారు. ఈయనకు నెలకు రూ.40 వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

జగనన్న ఆదేశాలు పాటించాం

- వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన ఎంపీపీ లక్ష్మీదేవి

మార్కాపురం: మార్కాపురం ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి ఎన్నిక విషయంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలను 13 మంది ఎంపీటీసీ సభ్యులు శిరసావహించారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు పేర్కొన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడిన ఎంపీటీసీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గురువారం మార్కాపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో అన్నా రాంబాబు మాట్లాడారు. అందరూ ఒకే తాటిపై నిలిచి లక్ష్మీదేవిని ఎంపీపీగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ విషయంలో పోరెడ్డి అరుణా చెంచిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఆమె రాజీనామాతో బండి లక్ష్మీదేవికి ఎంపీపీగా అవకాశం లభించిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రశాంతంగా ఎన్నిక ముగియడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలని నూతన ఎంపీపీ లక్ష్మీదేవికి సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు పోరెడ్డి చెంచిరెడ్డి, తుమ్మా వెంకటరెడ్డి, రఫీ, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి సోదరుడు కుందురు వెంకటరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, దేవండ్ల మల్లయ్య, పలువురు సర్పంచ్‌లు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రామతీర్థం తిరునాళ్లను జయప్రదం చేయండి


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి విజ్ఞప్తి

చీమకుర్తి: వచ్చే నెలలో జరగనున్న రామతీర్థం తిరునాళ్లను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. చీమకుర్తిలోని బూచేపల్లి కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో బూచేపల్లి శివప్రసాదరెడ్డి సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 11వ తేదీన చీమకుర్తిలో మందిరాల సంబరాలు, 12వ తేదీన రామతీర్థంలో గంగమ్మ తిరునాళ్ల వేడుకలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏటా ఆనవాయితీగా వైఎస్సార్ సీపీ తరుపున ఏర్పాటు చేయనున్న విద్యుత్‌ప్రభల నిర్మాణంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న రామతీర్థంలోని గంగమ్మ ఆలయంలో పూజల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, చేనేత సొసైటీ జిల్లా నాయకులు సోమా యానాదిశెట్టి, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, గోపురపు చంద్ర, సోమా శేషాద్రి, తప్పెట బాబూరావు, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, పాలపర్తి వెంకట్రావు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, అవ్వారు ఆదినారాయణ, షేక్ ఖాదర్‌బాషా, స్థానికులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జూనియర్ సివిల్ జడ్జిలు

ఒంగోలు: ఇటీవల విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైన ఇద్దరు గురువారం ఒంగోలులో బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లికి చెందిన షేక్ రోషన్ తొలి ప్రయత్నంలోనే ఏపీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2023లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన రోషన్ ఏపీ బార్ కౌన్సిల్లో 7 నెలలపాటు జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఈ క్రమంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై గురువారం ఒంగోలు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే, మంచిర్యాలలో ప్రైవేట్ విద్యా సంస్థ నిర్వహిస్తున్న యర్రం కరుణాకరరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రేఖ కుమార్తె షాలినీరెడ్డి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని అడల్ రామిరెడ్డి కాలేజీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆమె తెలంగాణాలో కొంతకాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జి పోస్టును త్రుటిలో కోల్పోయిన షాలినీరెడ్డి ఏపీ జ్యుడీషియల్ సర్వీస్‌లో పోస్టు దక్కించుకున్నారు. గురువారం ఆమె ఒంగోలు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న భానుసాయి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..


కంభంలోని ఓ చాయ్ కేఫ్‌లో తనిఖీ చేస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: చాయ్ కేఫ్‌లు ఇతర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఉన్న యువకులను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. 'జూదం.. జీవితం ఛిద్రం' శీర్షికన ఈనెల 26వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, మట్కా, ఇతర అసాంఘీక కార్యక్రమాలపై నిఘా పెంచారు. కంభం పట్టణంలో పలు చాయ్ కేఫ్‌ల్లో బుధవారం రాత్రి నుంచి ఎస్సై నరసింహారావు తన సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీ చేశారు. అనుమానస్పదంగా ఉన్న యువకుల మొబైల్ ఫోన్లు నిశితంగా పరిశీలించారు. కంభంతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ మట్కా, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులు తనిఖీలు చేస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ రుణాలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా బ్యాంకర్లకు సూచించారు. ప్రకాశం భవనంలో గురువారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు రుణాల మంజూరులో కేవలం లక్ష్యాలకు పరిమితం కాకుండా అన్ని రకాల దరఖాస్తులను పరిశీలించాలన్నారు. జిల్లాలో పశుపోషణ, మత్స్య, వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు ఎక్కువగా అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకోసం బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపార వేత్త రావాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉందని సూచించారు. లీడ్‌బ్యాంక్ డిస్ట్రిక్ట్ చీఫ్ మేనేజర్ డి.రమేష్ మాట్లాడుతూ పరిశ్రమలు, అనుబంధ రంగాలకు గత వార్షిక ప్రణాళికలో 91.99 శాతం రుణాలు ఇచ్చామన్నారు. అందులో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 88.72 శాతం రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. మెప్మా ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి 4 రెట్లు అధికంగా రుణాలు ఇచ్చామన్నారు. డీఆర్‌డీఏ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు 83 శాతం రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు 71 శాతం రుణాలు ఇచ్చామని చెప్పగా.. కలెక్టర్ స్పందిస్తూ మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరుకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల దరఖాస్తుదారులకు సాంకేతిక కారణాను చూపిస్తూ రుణాల మంజూరులో జాప్యం చేయవద్దన్నారు. సమావేశంలో ఆర్‌బీఐ ఎఫ్ఐడీడీ రోహిత అగర్వాల్, నాబార్డు డీడీఎం రవికుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావుతో పాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ


రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా గురువారం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ తలుపులు తెరిచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు దామరాజు క్రాంతి కుమార్ (వైఎస్సార్ సీపీ), కోనేటి వెంకటరావు(టీడీపీ), దండు శ్రీనివాసరావు(బీజేపీ), ఎం.రమేష్(జనసేన), ఒ.రసూల్(కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.